ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
సోమవారం 06, మే 2024 8 పేజీలు



ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియలో అన్ని జాగ్రత్తలు పాటించాలి

రిటర్నింగ్ అధికారి వి.పి.గౌతమ్

8వ పేజీలో...





# మన్యమంతా బెల్ట్ బాదుడు



**భద్రాచలం, ప్రభాతవార్త :** ఏ వీధి చూసినా ... ఏ సందు తిరిగినా ... మందుగ్లాసుల చప్పుళ్లే ...! మందుబాబుల ముచ్చట్లే. ఒకటే తాగుడు, తాగి ఊగుడు ...! అడుగు తీసి అడుగేస్తే బెల్ట్‌షాపులే ...! విచ్చలవిడిగా మద్యం విక్రయాలు ...! నడిరోడ్డుపైనే నిత్యం తాగుడు దృశ్యాలు ...! ఎన్నికల కోడ్ అమలుల్లో ఉన్నా... వీళ్ళకేమీ పట్టదు ...! ఎందుకంటే అడిగే నాధుడే లేరు కాబట్టి ...! బెల్ట్‌షాపుల దందాకు అంతులేకుండా పోయింది ...! మద్యం సిండికేట్ కనుసన్నల్లో ఈ వ్యాపారం మూడు బీరులు ... ఆరు బ్రాందీ బాటిళ్ళులా విరాజిల్లుతోంది ...! ఎక్సైజ్ శాఖ అధికారుల కన్నుసన్నల్లోనే ఈ తతంగం సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ...! ఆదివారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు భద్రాచలం ఏజెన్సీలో రెండు చోట్ల జరిగిన దాడుల్లో మద్యం బాటిళ్ళు పెద్ద ఎత్తున పట్టుబడ్డాయంటే ఎక్సైజ్ శాఖ ప్రేక్షక పాత్ర బట్టబయలైందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రభాతవార్త అందిస్తున్న ప్రత్యేక కథనం .....

-మన్యమంతా బెల్ట్‌బాదుడు

భద్రాచలం ఏజెన్సీలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఊరూర, సందు, సందు బెల్ట్‌షాపులు

2లో..

- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- ఎన్నికల కోడ్ ఉన్నా ఆగని దందా
- ఏజెన్సీలో ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులు
- రెండు చోట్ల పట్టుబడ్డ మద్యం
- ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ శాఖ
- వెల్లువెత్తుతున్న విమర్శలు



# ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

రెండు కేంద్రాల్లో 1125 మంది హాజరు...

49 మంది గైర్హాజరు

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మే 5 - ప్రభాతవార్త: ప్రతీ సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నీట్ 2024 పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1174 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1125 మంది హాజరుకాగా 49 మంది గైర్హాజరయ్యారు.

8వ పేజీలో...

# మృత్యువులోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు



2వ పేజీలో...

లక్ష్మీదేవిపల్లి, మే 5 - ప్రభాతవార్త: "పెళ్లినాడు చేసుకున్న ప్రమాణాలు... జీవితకాలం... తోడూనీడగా ఉంటా మని.. కష్టసుఖాల్లో పాలుపంచు కుంటామని ఒకరికొకరు ప్రమాణాలు చేసుకున్నారు... నిండునూరేళ్లు కలిసి నడుద్దామని ....

# ఖమ్మం జిల్లాకు దిక్సూచి సత్తుపల్లి

**సత్తుపల్లి, మే 05, ప్రభాతవార్త:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలకు ఓ ప్రత్యేకత ఉంది. కమ్యూనిస్టుల కిల్లాగా పోరున్న ఈ జిల్లాకు ఆది నుండి సత్తుపల్లి నియోజకవర్గం నుండి గెలుపొందిన వివిధ పార్టీలకు చెందిన నేతలే జిల్లా మరియు రాష్ట్ర వ్యాప్తంగా చక్రం తిప్పిన పేరుంది. ఈ ఆనవాయితీ నేడు కొనసాగుతుందనడంలో అతిశయోక్తిలేదు. నాటి సత్తుపల్లి నియోజకవర్గం నుండి గెలుపొందిన స్వర్గీయ సర్దార్ జలగం వెంగళరావు జిల్లా పరిషత్ చైర్మన్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఎమ్మెల్యేగా, ఎంపిలుగా గెలుపొంది రాష్ట్ర హోం మంత్రిగా, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రిగా పధవులు అలంకరించి ఈ నియోజకవర్గాన్ని దేశ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. ప్రస్తుత రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సైతం ఈ నియోజకవర్గంకు చెందినవారే కావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలు ఈ నేతల మద్యే తిరుగుతున్నాయి. వీరితో పాటు సర్దార్ జలగం వెంగళరావు తనయులు జలగం ప్రసాద్‌రావు, జలగం

2లో...

- రాష్ట్రాన్ని చక్రం తిప్పిన జలగం, తుమ్మల, పొంగులేటి
- ఆర్ఆర్ఆర్, నామాల మధ్య పోటీ

# మన్యమంతా బెల్ట్‌బాదుడు

(మొదటి పేజీ తరువాయి..)

వెలిసి మందుబాబుల జేబులు చిల్లులు పడేలా వ్యాపారం సాగుతుంది. ఒకప్పుడు వైన్ షాపులకు వెళ్ళి మద్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దాంతో అడపా దడపా మాత్రమే ఏజెన్సీ వాసులు మద్యం సేవించే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సందు సందుకు గొంది గొందుకు బెల్ట్‌షాపు ఉండడంతో విచ్చలవిడిగా ప్రజలు మద్యం సేవిస్తున్నారు. అనారోగ్యం భారిన పడుతున్నారు. మద్యం సిండికేట్ వ్యాపారస్తులు కనుసన్నల్లో ఈ బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. సిండికేట్ నుంచి మద్యం విచ్చలవిడిగా పట్టపగలే సప్లై అవుతోంది. ఎక్కడిక్కడ బెల్ట్‌షాపుల్లో పగలెనకా .. రాత్రనక మద్యం అమ్మకాలు, సిట్టింగ్‌లు యద్దేశ్చగా సాగిపోతున్నాయి. భద్రాచలం పుణ్యక్షేత్రంలో దాదాపు 600లకు పైగా బెల్ట్‌షాపులు ఉన్నాయంటే ఇక అక్రమ మద్యం ఎంత ఏరులై పారుతుందో అర్థం చేసుకోవచ్చు. పుణ్యక్షేత్రంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక సమీప గ్రామాల్లో మద్యం విక్రయాలను అంచనా వేయవచ్చు. ఇంత విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నా ... సంబంధిత శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది ప్రశ్నార్థకం. ఎక్సైజ్ శాఖ పాత్రపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులు బెల్ట్‌షాపుల ఆగడాలను సహించలేక ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికి ప్రయోజనం లేకుండా పోతుండడంతో స్థానిక రోధన అరణ్యరోధనగానే మిగిలిపోయింది. ఇక ఎక్సైజ్ శాఖ ఉండి ఏమి ప్రయోజనం అంటూ స్థానికులు మండిపడుతున్నారు. రోజు రోజుకు మద్యం సేవించే వారి సంఖ్య పెరగడం తద్వారా వారు అనారోగ్యం పాలై బలైపోతుంటే మహిళలు ఆవేదన పట్టించుకునే నాథుడే లేరన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే బెల్ట్‌షాపుల్లో మద్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వైన్‌షాపుల్లో క్వార్టర్ బాటిల్స్ అందుబాటులో ఉంచకుండా వాటిని బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారు. ఒక్కో క్వార్టర్‌పై బెల్ట్‌షాపుల వారికి రూ.10లు అదనంగా వైన్ సిండికేట్ వ్యాపారులు అందజేస్తుండగా, వారు మరో రూ.20 కలిపి మద్యం ప్రియులకు విక్రయిస్తుండడం గమనార్హం. చేసే గత్యంతరం లేక మద్యం ప్రియులు అధిక ధరలకు క్వార్టర్ బాటిల్స్ కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కావాలనే వైన్‌షాపుల్లో కొన్ని బ్రాండ్‌లకు సంబంధించి క్వార్టర్ బాటిల్స్‌ను అందుబాటులో లేకుండా సదరు వ్యాపారస్తులు చేస్తుండడం ఈ పరిస్థితికి దాపురిస్తుంది. బీరు బాటిళ్ళు కూడా ఇలాగే కొరతను సృష్టిస్తున్నారు. కొన్ని బ్రాండ్‌ల మద్యం బాటిళ్ళను కూడా అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ఇదంతా సొమ్ము



చేసుకోవడానికే సిండికేట్ హై డ్రామా ఆడుతోందని, ఇందతా తెలిసినప్పటికి సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### -ఎన్నికల కోడ్ ఉన్నా ఆగని దందా

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయినప్పటికి ఏ మాత్రం మద్యం విక్రయాలు మన్యంలో ఆగడం లేదు. బెల్ట్‌షాపుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు యద్దేశ్చగానే మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఆదివారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు భద్రాచలం మన్యంలో మద్యం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. భద్రాచలం పట్టణంలో పాతమార్కెట్ సెంటర్‌లో ఓ బెల్ట్‌షాపులో సుమారు రూ.30వేలు విలువ చేసే మద్యం బాటిళ్లు పెద్ద ఎత్తున పట్టుబడ్డాయి. దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం క్రాస్ రోడ్డు వద్ద కూడా సుమారు రూ.40వేలు విలువ చేసే బెల్ట్‌షాపుల్లో దొరికాయి. దీనిని బట్టి ఎన్నికల వేళ కూడా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగుతుండడం ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుందని బహిరంగ విమర్శలు వచ్చాయి. ఈ రెండు సంఘటనల్లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ళను ఫ్లయింగ్ అధికారులు ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పజెప్పినట్లు తెలిసింది. వారిపై సంబంధిత శాఖ అధికారులు కేసులు నమోదు చేసినట్లు సమాచారం. భద్రాచలం మన్యంలో విచ్చలవిడిగా సాగుతున్న బెల్ట్‌షాపుల విక్రయాలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారుల పనితీరుపై కూడా ఆరా తీయాల్సిన అవసరం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. బెల్ట్‌షాపులు ఇంత పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నప్పటికి ఎక్సైజ్ శాఖ అధికారులు వాటిని అదుపు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు తప్పకుండా జోక్యం చేసుకోవాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు. భద్రాచలం ఏజెన్సీలోని పలు మండలాల్లో ఉన్న వైన్ సిండికేట్ వ్యాపారస్తులు సాగిస్తున్న మద్యం దందాపై చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలని పలు ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు.

# మృత్యువులోనూ వీడని బంధం...

(మొదటి పేజీ తరువాయి..)

ప్రకారమే కష్టసుఖాల్లోనే కాదు ఏకంగా చావులో కూడా తోడుగా ఉన్నారు... రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది.. ఈ సంఘటన గురించి తెలిసిన వారంతా నిర్ఘాంతపోయారు... రోజూ కలిసి పనికి వెళ్లేవారు... ఒకరి వెంట ఒకరు అన్నట్లుగా ఉండే వారు ఇప్పుడు ఒకరితో మరొకరు కలిసి అనంత లోకాలకు వెళ్లిపోయారు... వారి దాంపత్య జీవితంపై ఎవరి కన్ను పడిందో ఏమో కానీ టిప్పర్‌లారీ రూపంలో వారిని కబళించింది" ... ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి...

పాల్వంచ మున్సిపాలిటీ మంచికంటినగర్‌కు చెందిన కుంపటి సామేలు (57), కుంపటి పద్మ (45)లు పాల్వంచ దమ్మపేట సెంటర్‌లో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే పని నిమిత్తమే దేనికోసమో కానీఇద్దరూ వారి టీవీఎస్ బండిపై అనిశెట్టిపల్లికి వచ్చారు. అక్కడ రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చిన టిప్పర్‌లారీ వారి బండిని బలంగా ఢీ కొట్టేసింది. ఈ దుర్ఘటనలో భార్య పద్మ అక్కడికక్కడే మృతి చెందగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సామేలును స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సామేలు మృతి చెందాడు. భార్యాభర్తలు ఇద్దరూ ఒకేసారి మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాజ్యాంగంను ప్రతి ఒక్కరు అనుసరించాల్సిందే

## స్వావలంభనతోనే అభివృద్ధికి అడుగులు

## విలేకర్ల సమావేశంలో తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం ప్రభాతవార్త:



దేశ అత్యున్నత గౌరవంగా భావించే రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాల్సిందేనని, గ్రామ స్వావలంభన అభివృద్ధికి అడుగులుగా ఉంటాయని అటువంటి పరిణామాలు శాశ్వత పరిష్కార మార్గాలుగా ఉండాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోదరావు పేర్కొన్నారు. ఆదివారం ఓ హోటల్‌లో మాజీ మంత్రి విజయరామరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలల్లో అత్యంత వేగంగా అభివృద్ధి జరుగుతున్న దేశం ఏదైనా ఉందంటే అది కేవలం మన దేశమే నని అటువంటి విధానాలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ కరిష్మాతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాలు పట్టుకొమ్మలుగా ఎదగాలంటే స్వావలంభన ప్రభావం దానిని అనుసరించే విధానం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆటుపోట్లు చవిచూసినా భారతీయ జనతా పార్టీ ఈ దేశ రక్షణ కోసం దేశ ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతుందని కులాలకు, మతాలకు తావులేకుండా అన్ని వర్గాలను గౌరవిస్తూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలన్న సంకల్పంతో మోడీ ప్రభుత్వం కొనసాగిందన్నారు. ఈ సారి కూడా మోడీ 3వ సారి తన అధిపత్యాన్ని కొనసాగించేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. ప్రపంచ దేశాలు సైతం నేడు భారత్ వైపుచూసే విధంగా మన దేశం అంత ముందుకు శరవేగంగా దూసుకుపోతుందన్నారు. అందులో భాగంగానే అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ట స్థాపించుకోవడం గొప్ప పరిణామం అన్నారు. ఇటువంటి పరిణామాలను గమనిస్తున్న ప్రజలు మరోసారి బిజేపికి అవకాశాలు కల్పించేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. కారేపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఎంపిటిసిలు పలువురు ప్రజా ప్రతినిధులు కమలం వైపు వచ్చి కండువా కప్పుకోవడం గొప్ప శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విజయరామారావు మాట్లాడుతూ ఇప్పటి వరకు పాలించిన ప్రధానమంత్రుల్లో మోడీ విధానం దేశ ప్రజలకు అమితంగా ఆకట్టుకునే విధంగా ఉందన్నారు. ఏదైతే మాట ఇచ్చారో ఆ మాట కోసం ఆయన ఎంత వరకు అయినా పోరాటం చేస్తారని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణ, అల్లిక అంజయ్య, మోహన్, విరునాయక్, కృష్ణ రాథోడ్, రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాకు దిక్సూచి సత్తుపల్లి







(మొదటి పేజీ తరువాయి..)

వెంగళరావు సైతం ఈ నియోజకవర్గం నుండి విజయం సాధించినవారే. వీరిలో పెద్ద కుమారుడు జలగం ప్రసాద్ రావు, పలు మంత్రుల పధవవులు నిర్వహించి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రాజకీయంగా చక్రం తిప్పారు. పై నేతలు సుమారు 40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో వీరు ఎటువైపుగా వెళితే జిల్లా రాజకీయాలు సైతం ఈ నేతల వైపు వెళుతూ బలమైన కేడర్‌ను తయారు చేసుకుంటూ వస్తున్నారు.

### ఆర్.ఆర్.ఆర్, నామాల మధ్య: -

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలు సత్తుపల్లి చుట్టూ తిరుగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. రాష్ట్ర ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మరియు చేనేత, గిడ్డంగుల సంస్థ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు రాజకీయంగా సుదీర్ఘ అనుభవం కలిగి అంగబలం, అర్థబలంతో కేడర్‌గల రాజకీయ ఉద్దండులు వీరంతా సత్తుపల్లి నియోజకవర్గంకు చెందిన వారే కాబట్టి పార్లమెంట్ ఎన్నికలు రసవత్తరంగా ఉన్నాయి. ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలు ఈనెల 13న జరగుతుండటంతో పోలింగ్ తేదీకి కేవలం వారం రోజులే గడువు ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలైన అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందినవారు తమ ప్రచారాలను ముమ్మరం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుండి సీపీఐ, సిపిఎం, తెలుగుదేశం పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న రామ సహాయం రఘురామరెడ్డి తరుపున నియోజకవర్గ వ్యాప్తంగా స్థానిక ఎమ్మెల్యే డా. మట్టా రాఘమయి దయానంద్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ, చేనేత గిడ్డంగుల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఆ పార్టీ ప్రముఖులతో పట్టణాలలో రోడ్డు కార్నర్ మీటింగ్‌లు విస్తృతంగా ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుండి ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావు రంగంలో ఉండగా, ఈయన గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధులు గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. బీజేపీ పార్టీ తరుపున రంగంలో ఉన్న తాండ్ర వినోదరావు గెలుపుకోసం ఆ పార్టీ అగ్రనేతలు కేంద్ర రక్షణ మంత్రి, రాజ్‌నాథ్ సింగ్, ఆ పార్టీ అధ్యక్షులు జేపి నడ్డా, కేంద్ర హోం శాఖ మంత్రి హమీద్‌షాలు ఉమ్మడి జిల్లాలో ప్రచారం నిర్వహించడం జరిగింది. పోటీలో పై ముగ్గురు అభ్యర్థులు రంగంలో ఉన్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్. రఘురామ్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుల మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ రసవత్తరంగా ఉన్నట్లు రాజకీయ పార్టీల విశ్లేషకులు పేర్కొంటున్నారు జిల్లాలో రెండు బలమైన ఖమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన ఈ ఇద్దరు అభ్యర్థులు గెలవాలంటే ఈ సమాజిక వర్గాలకు చెందిన వారే ఓటర్లను ప్రభావితం చేసే శక్తి ఉంది. కావున ఈ ఇద్దరి మధ్యే గెలుపు ఓటములు నెలకొని ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## గాలి దుమారంతో పడిపోయిన చెట్లు





**కారేపలి, మే 5, ప్రభాతవార్త :**

సింగరేణి మండల వ్యాప్తంగా ఆదివారం సాయంకాలం కురిసిన వడగళ్ల భారీ వర్షం ఫలితంగా నష్టం వాటిల్లింది మండల పరిధిలోని గ్రామాల్లో పలు గ్రామాల్లో ఇంటి కప్పులు రేకులు లేచిపోవడంతో పాటు కొన్ని గోడలు కూలిపోయాయి మధ్యాహ్న సమయం వరకు విపరీతమైన ఉష్ణోగ్రతలు నమోదైన క్రమంలో నాలుగున్నర ప్రాంతంలో భారీ గాలి దుమ్ముతో పాటు వడగళ్ళు పడ్డాయి కాగా తీవ్ర గాలి ప్రభావం చే విద్యుత్ సరఫరా విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో పాటు పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగి పడటంతో మండలంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది మాదారం గ్రామంలో గల జంగాల కాలనీలో రేపల్లె నవీన్ కు చెందిన ఇంటి రేకులు గాలి దుమారానికి లేచిపోయాయి రెబ్బారం సత్యవతి కి చెందిన ఇంటి రేకులు పడిపోయాయి కాగా కళ్లెం కోటయ్య కు చెందిన ఇంటిలో వరద నీరు నిలిచింది డేరా వేసుకుని నివాసం ఉంటున్నారు భారీ వర్ష ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు సేకరించి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## ఇందిరమ్మకు ఎంపీటీసీ ఉమాశంకర్ నివాళి

**కారేపల్లి, మే 5,, ప్రభాతవార్త :**



కారేపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన పుష్పాల రామారావు మాతృమూర్తి పుష్పాల ఇందిరమ్మ దశరిన కర్మలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి లో ఆదివారం జరిగాయి. కారేపల్లి మండలం తొడితలగూడెం ఎంపీటీసీ పెద్దబోయిన ఉమశంకర్ ఇందిరమ్మ చిత్రప టానికి పూలతో ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యుజే (ఐజేయూ) మండల కన్వీనర్ తేళ్ళ శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ మర్శకట్ల రోశయ్య, నాయకులు అడపా పుల్లారావు, యువజన నాయకులు భూక్య రాంకిసోర్ నాయక్, గుగులోత్ హారు, బాణోత్ కోటి, పాల్గోన్నారు.

## భారీగా కాంగ్రెస్ లో చేరికలు

**కారేపల్లి, మే 5, ప్రభాతవార్త :**

ఉసిరికాయలపల్లి గ్రామం నుండిమాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, దాసరి ఐలయ్య, కొమ్ము వెంకన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాళోత్ రాం దాస్ నాయక్ సమక్షంలో ఆదివారం వైరా లో క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉసిరికాయలపల్లి కి చెందిన సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి మండల వెం కన్న, పోతూరజు అర్జున్, సీపీఐ సీనియర్ నాయకులు, బోడ భద్రు, బిఆర్ఎస్‌కు చెందిన 8వ వార్డు మెంబర్ పచ్చిపాల తిరుపతిరావు, బి ఆర్ఎస్ నాయకులు జ్యోతి చికెన్ సెంటర్ ప్రొప్రైటర్ పచ్చిపాల వెంకట్ యాదవ్, దాసరి నరేష్, చీముల కమల్, ఎల్లబోయిన పండు, లకావత్ రత్న, చిగుర్తి శివ, తాండ్రరాజేష్, గద్దల కోటేష్,కొమ్ముఐలయ్య ఉన్నారు.

## ఫస్ట్ తారీఖు జీతం దేవుడెరుగు..?

### - నెలలు గడుస్తున్నా జీతాల్లేక ఉద్యోగుల అవస్థలు....

**పెనుబల్లి, మే 5, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తులకు గత ప్రభుత్వం కంటే భిన్నంగా ప్రతి నెలా మొదటి తారీకున జీతాలెస్తారన్న మాట దేవుడెరుగు కాని, నెలలు గడిచినా జీతాలు రాక అనేక శాఖల్లోని ఉద్యోగస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ సిబ్బంది, స్త్రీ శిశు సంక్షేమ శాఖలోని అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయితీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు గత మూడు నాలుగు నెలలుగా జీతాల్లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారితే గత ప్రభుత్వం కంటే భిన్నంగా ప్రతి నెలా మొదటి తారీకునే జీతాలు వస్తాయనుకున్న ఉద్యోగస్తుల ఆశలు కలలు గానే మిగిలాయి. చాలీ చాలని జీతాలతో జీవితాలు గడుపుతున్న ఈ శాఖల సిబ్బంది జీతాలు నెలల కొద్ది రాకపోవడంతో ఆర్ధికంగా ఇబ్బంది పడుతున్నట్లు వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా ఈ శాఖల్లోని సిబ్బంది వేతనాలు విడుదల చేసి, తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## హెచ్ 142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాజామొయినుద్దీన్‌కు ఘననివాళి





**పాల్వంచ, మే 5 - ప్రభాతవార్త:**

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 142 ఫౌండర్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఖాజా మొయినుద్దీన్ ఇటీవల మృతి చెందడంపై యావత్ విద్యుత్ కార్మికులకు తీరనిలోటని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు అన్నారు. హైదరాబాద్ విద్యుత్ సౌధలో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఖాజా మొయినుద్దీన్ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం తీసుకుంటూ గత నెల 29న హటాత్తుగా మరణించారు. ఆయన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఆదివారం కేటీపీఎస్‌ఏ కాలనీలోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావుపాల్గొని మొయినుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, బొల్లేపల్లి కృష్ణమూర్తి, సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, సయ్యద్, శివరాం, వెంపటి అనీల్, ఎర్రగడ్డ ప్రసాద్, వేణు, గోపయ్య, కోటేశ్వరరావు, నాగేందర్, ప్రకాష్, చిన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీతారాంపురం ఆదివాసీలను వెంటనే ఆదుకోవాలి



**పాల్వంచ రూరల్, మే 5 - ప్రభాతవార్త:**

మండలంలోని సీతారాంపురం ఆదివాసీలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వరరావులు అన్నారు. దంతెలబోర ఎస్సీకాలనీ పంచాయతీ శివారు సీతారాంపురం గ్రామాన్ని ఆదివారం వారు సందర్శించారు. శనివారం కురిసిన వర్షం, గాలిదుమారానికి గ్రామంలో సుమారు 20 ఇళ్ల పైకప్పు పెంకులు, రేకులు మొత్తం నేలమట్టం అయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, చెట్టుపై పడిడుగు కూడా పడిందని ప్రజలు ఆందోళనతో పరుగులు తీశారని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొత్తం వర్షంలో తడిసిందని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మడివి దేవా, సుక్క, ముస్కి గంగా, అంజలి, మడవి జోగా పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన రమేష్



**లక్ష్మీదేవిపల్లి, మే 5 - ప్రభాతవార్త:**

మండలంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన సంగం వీరన్న పెద్దమ్మతల్లి గుడికి వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్య, కొడుకు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీనగర్‌కాలనీ మాజీ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్‌చంద్ పాల్వంచలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యం చెప్పారు.

## నేరాలు-దారుణాలు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**కారేపల్లి, మే 5, ప్రభాతవార్త :**

కారేపల్లి ఇల్లందు రహదారి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవేట్ అంబులెన్స్ మోటర్ సైకిల్ ని ఢీకొన్న ఘటన సింగరేణి మండలం లో చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సింగరేణి మండల పరిధిలో కారేపల్లి ఇల్లందు రహదారి మార్గంలో పోలంపల్లి బైపాస్ రహదారి సమీపంలో ఇల్లందు నుండి వస్తున్న ప్రైవేట్ అంబులెన్స్, ఉసిరికాయలపల్లి నుండి ఇల్లందు వైపుగా వేళ్లున్న మోటార్ సైకిల్ ఢీకొన్నది ఈ ఘటనలో మోటార్ సైకిల్ నడుపుతున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు, ఇకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మోటార్ సైకిల్ నడుపుతూ గాయపడ్డ వారు ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన వంట మాస్టర్ లకావత్ రాజేష్, లాకావత్ రమేష్ గా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. వేగంగా వచ్చి మూలమలుపు ఉండడం అంబులెన్స్, మోటార్ సైకిల్ ని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు..

## పిడుగుపాటుకు ఇరువురికి గాయాలు



**కారేపల్లి, మే 5, ప్రభాతవార్త :**

సింగరేణి మండలం లో ఆదివారం సాయంకాలం కురిసిన వడగళ్ల వాన ఫలితంగా పేరుపల్లి గ్రామపంచాయతీ జమాలపల్లి దగ్గర పిడుగుపాటుకు గురై ఇరువురికి గాయాలయ్యాయి పేరుపల్లి గ్రామానికి చెందిన తెల్ల గొల్ల వారి బంధువు ఇద్దరినీ హుటాహుటిన హాస్పిటల్ కి తరలించడం జరిగింది.. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉంది బాధితులకు వైద్య చికిత్స అందిస్తున్నారు.

## వడదెబ్బకు గురై వ్యక్తి మృతి

**పెనుబల్లి, మే 5, ప్రభాతవార్త**

రెండు రోజుల క్రితం మండల కేంద్రంలోని వియం.బంజర్ రింగ్ సెంటర్లో జరిగిన కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి మీటింగ్‌కు హాజరై వడదెబ్బకు గురై మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని సూరయ్య బంజర్ తండాలో చోటు చేసుకుంది. సూరయ్య బంజర్ తండాకు చెందిన భూక్యా రాము (45) రెండ రోజుల క్రితం వియం. బంజర్‌లోని రింగ్ సెంటర్లో కార్నర్ మీటింగ్‌కు గ్రామస్థులతో కలిసి హాజరైన భూక్యా రాము ఆ రోజు వాంతులు, వీరేచనాలు అవ్వడంతో బహిర్భూమికని పెనుబల్లి ఏరియా వైద్యశాలకు ఎదురుగా జాతీయ రహదారి ప్రక్కన ఉన్న పొలాల్లోకి వెళ్ళి అక్కడే మృతిచెందగా ఆదివారం ఉదయం గుర్తించారు. గత రెండు రోజుల నుండి భూక్యా రాము కోసం కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర గ్రామాల్లో గాలిస్తూ వచ్చారు. మీటింగ్‌కు వెళ్ళిన రాము తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రెండు రోజులుగా దు:ఖంలో మునిగిపోయారు. ఆదివారం ఉదయం రాము మృతదేహం ఆచూకీ తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు చేరుకుని గుండెలవిసేలా రోధించారు. వియం. బంజర్ పోలీస్‌లు మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

### మృతదేహాన్ని, మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే...

వడదెబ్బకు గురై మృతిచెందిన భూక్యా రాము మృతదేహాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు కీసరి శ్రీనివాసరెడ్డి, వంకాలపాటి వెంకటేశ్వరరావు, భూక్యా కృష్ణవేణి, చీకటి రామారావు, రాజబోయిన కోటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మిగిలింది ఐదురోజులే..

**ప్రచారానికి దగ్గర పడుతున్నగడువు**

**ఆఖరి అస్త్రాలను సంధిస్తున్న అభ్యర్థులు**

**ఎదుటి పక్షం ఓట్లకు గండి కొట్టే వ్యూహాలు**



**కరకగూడెం,ప్రభాతవార్తః**

ఎన్నికల సమరంలో అసలు సిసలైన అంకం మొదలైంది.ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడటంతో ప్రధాన పక్షాలకు చెందిన అభ్యర్థులు ప్రచారానికి పదునెక్కిస్తున్నారు.ఆఖరి అస్త్రాలను సంధిస్తున్నారు.ఈ నెల 13వ తేదీన పోలింగ్ ఉండటంతో ప్రచార పర్వానికి కేవలం ఐదురోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి.ఇదే అదునుగా అభ్యర్థులు ఎత్తుగడలతో కూడిన వ్యవహారాల్ని లోలోపల అమలు చేస్తున్నారు.ముఖ్యంగా మండల స్థాయిలో కీలక నేతల ద్వారా వీలైనన్ని ఓట్లును రాబట్టుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.మహబూబాబాద్ పార్లమెంటు స్థానం పరిధిలో అగ్రనేతల ప్రచారాలు,ముఖ్య నాయకుల రోడ్‌షోలు జోరుగా ఓటర్లను ప్రభావితం చేసేలా కార్యక్రమాల్ని నిర్వహించి ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.ఓటు బ్యాంకును పదిల పరుచుకునేలా మూడు ప్రధాన పార్టీల తరపున బరిలో నిలిచిన అభ్యర్థుల పోటాపోటీ తీరును చూపిస్తున్నారు.ముఖ్యంగా తెరవెనుక చక్రంతిప్పుతున్నారు.ప్రత్యర్థి పార్టీల నుంచి వీలైనన్ని ఎక్కువ ఓట్లను కొల్లగొట్టేలా వ్యూహాలను రూపొందిస్తూ పక్కాగా ప్రణాళిక అమలు చేస్తున్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ బూతుల వారీగా భారీ వ్యత్యాసం ఉన్నచోట ప్రత్యేకమైన దృష్టి సారిస్తున్నారు.ఎక్కడ ఎక్కువ మొత్తంలో తమకు అనుకూలంగా ఓట్లు రావాలంటే అక్కడి గ్రామ,మండల స్థాయి నాయకులను ఎలా ప్రభావితం చేయాలనే తీరుపై సమాలోచనలు చేస్తున్నారు.సామాజిక తరగతుల వారీగా ఓట్లు రాబట్టుకునే క్రమంలో అందుకు తగిన వ్యక్తుల్ని గుర్తిస్తూ వారితో మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం.ఇందుకు ఆయా చోట్ల నాయకులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.తక్కువ సమయం ఉండటం వల్ల కీలకంగా మార్చుకొని గ్రామస్థాయిలో పట్టున్న నాయకులను మరింత చురుకుగా ఈ ఎన్నికల్లో వ్యవహరించేలా చూసుకుంటున్నారు.ఇప్పటి వరకు రోడ్ షోలు, సభలు,సమావేశాలతో కనిపించిన ఎన్నికల సందడిలో ఇకపై కొత్త పందా కనిపించనుంది.మండల,గ్రామ స్థాయిలో ప్రభావాన్ని చూపే నాయకులకు ఎంతో కొంత నగదు ముట్ట చెప్పే ప్రయత్నం,జరుగుతున్నట్లు తెలుస్తుంది,మండల స్థాయి నాయకులపైనే అన్నీ పార్టీలు అభ్యర్థులు భారీగా ఆశలు పెట్టుకున్నారు.పోలింగ్ శాతాన్ని పెంచేలా చూడటంతో పాటు వీలైనన్ని ఎక్కువ ఓట్లు తమకు పడేలా చూడమని తగు ఆదేశాలిస్తున్నారు.మీ కీలకమైన సమయం లోనే ప్రతి నిమిషాన్ని వృధా చేయుకండా విస్తృతంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వినియోగించేలా శ్రేణులు సిద్ధంగా ఉన్నారు.కొత్త ఓటర్లతోపాటు యువత ఓట్లను రైతుల ఓట్లను సంపాదించేలా ఎవరికి వారుగా ప్రయత్నాన్ని ముమ్మరం చేస్తున్నారు..



## ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియ పూర్తి

**-అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్**

**భద్రాచలం, ప్రభాతవార్త :**

మహబూబాబాద్ (ఎస్టీ) పీసీ పరిధిలోని 110 – పినపాక (ఎస్టీ) అసెంబ్లీ సెగ్మెంట్‌లో 250 పోలింగ్ స్టేషన్‌లకు గాను ఈవీఎంలను కమిషనింగ్ చేసే స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచడం జరిగిందని 110 –పినపాక (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ అన్నారు. ఆదివారం మణుగూరులోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ప్రజాప్రతినిధులు, భద్రతా సిబ్బంది సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తాళాలు వేసి ఈవీఎం మిషన్‌లు, బీఎంలు, సీయూలు, వీవీ ప్లాట్‌లు అన్ని సక్రమంగా ఉన్నది, లేనిది పరిశీలించి 30 సెక్టార్లు ఏర్పాటు చేసి, సెక్టార్ అధికారులు, పీవోలు, ఏపీవోలు, వారి సిబ్బంది సహకారంతో సెక్టర్, పీఎస్‌వైజ్‌గా ఈవీఎం కమిషనింగ్ చేసి డిస్ట్రిబ్యూషన్‌కు ముందు భద్రపరచడం జరిగిందని అన్నారు. బీయూలు 624, సీయూలు 312, ఏవీ ప్యాట్లు 350, రిజర్వ్ మిషన్‌తో కలుపుకుని, ఇంజనీర్ల సమక్షంలో జాగ్రత్తగా పరిశీలించి 23 మంది అభ్యర్థుల ఓట్లు వేసే బ్యాలెట్ పేపర్ అంటించి, మిషన్‌లు అన్నియూ సక్రమంగా పనిచేస్తున్నది, లేనిది పరిశీలించి జాగ్రత్తగా సీలు వేసి స్ట్రాంగ్ రూమ్‌కు చేరవేయడం జరిగిందని అన్నారు. సెక్టరల్ ఆఫీసర్‌లు, పీవోలు, ఏపీవోలు, సపోర్టింగ్ సిబ్బంది, పోలింగ్ తేదీకు ముందు రోజు ఈవీఎం మిషన్‌లను పోలింగ్ మెటీరియల్ తీసుకుని వెళ్ళే రోజు మాత్రమే ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను తెరవడం జరుగుతుందని, అంతవరకు సీఆర్పీఎఫ్ జవాన్లు, పోలీసుల రక్షణలో 24 గంటలు కాపలా కాయడంతో పాటు స్ట్రాంగ్ రూమ్ పరిసరాలు, స్ట్రాంగ్ రూమ్ దగ్గర సీసీ కెమెరాల నిఘా నీడలో భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన అన్నారు. అనంతరం ఎన్నికల విధులో పాల్గొంటున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహిసిల్దార్ రఘువరెడ్డి, ఎలక్షన్ డీటీ నాగరాజు, ఈవీఎం నోడల్ అధికారి ముజాహిద్, ఆర్ఐ కృష్ణ, ఐటిడిఏ ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, డీటీఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, ఐటిడిఏ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వైభవోపేతంగా రామయ్య కళ్యాణం

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం ఆదివారం వైభవోపేతంగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణీత, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్య ధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్చరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణ లడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.

## ఎన్నికల సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలి



**-ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలి**

**-పినపాక ఏఆర్వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**

**మణుగూరు, ప్రభాతవార్త, మే 5 ః**

ఎండలు మండుతున్నందున పార్లమెంటు ఎన్నికల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బందికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించాలని పినపాక ఏఆర్వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. ఆయన ఆదివారం మణుగూరు జెడ్పీ కో ఎడ్యూకేషన్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్యాలరీలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లకు సామాగ్రి తీసుకెళ్లే పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్కూల్ ఆవరణలో మంచినీటి సౌకర్యం, భోజన వసతి, టెంట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడంతోపాటు సమయానుకూలంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సమాగ్రి తీసుకెళ్లేటప్పుడు వారిని సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు చేరవేసేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది సామాగ్రిని సరి చూసుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నెల 11 తేదీ సాయంత్రం వరకు స్కూల్ ఆవరణలో టెంట్లు, కుర్చీలు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది సామాగ్రి తీసుకెళ్లేటప్పుడు బస్సుల్లో మంచినీటి సౌకర్యంతోపాటు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఎవరూ ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది వెళ్లే సమయంలో తప్పనిసరిగా భోజనం చేసి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎలక్షన్ డిటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎంసెట్ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన

**సారపాక, ప్రభాతవార్త :**



సారపాక బ్రిలియంట్ జూనియర్ కళాశాల వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంసెట్ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభిందించి. వివిధ కళాశాలల్లో చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులు దాదాపు 83 మందికి పైగా ఈ మోడల్ పరీక్షకు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. బీఎన్ఆర్ ఎంసెట్ మోడల్ పరీక్ష నిర్వహించి మారుమూల ప్రాంత విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు బీఎన్ఆర్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ మాట్లాడుతూ .. రెండు రోజులలో నిర్వహించే ఎంసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించడానికి ఈ మోడల్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంసెట్ పరీక్ష రాసే గ్రామీణ ఏజెన్సీ విద్యార్థులకు మ్యాథ్స్ సైన్స్ సబ్జెక్టుల వారి యొక్క సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఈ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మీరంతా డాక్టర్లు ఇంజనీర్లు అయి తమ దేశానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రపంచ నవ్వుల దినోత్సవం

## ప్రపంచ శాంతికై నవ్వుదాం

## పెవిలియన్ గ్రౌండ్‌లో వరల్డ్ లాఫింగ్ డే

**కార్పొరేషన్, మే5, ప్రభాతవార్త:**
ఆరోగ్యవంతమైన జీవితానికి నవ్వు ఎంతో ఉపయోగపడుతుందని బెంగళూరు లాఫ్టర్ యోగా యూనివర్శిటి ట్రైనఱన తెలంగాణ యోగా సంఘం అధ్యక్షులు న్యాయవాది మరికంటి వెంకట్ తెలిపారు. ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ యోగ సంఘం అధ్యక్షులు మరికంటి వెంకట్, ఖమ్మం బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాసరావు, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ ఆసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండమీది వెంకట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో ప్రపంచశాంతికై నవ్వుదాం అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 1995 సంవత్సరంలో మే మొదటి ఆదివారాన్ని నవ్వు దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మున్సిపల్ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ ఆసోసియేషన్ ట్రెజరర్ పి.సుదర్శన్, రామనాథం, యం.దామోదర్‌రెడ్డి, తాల్లూరి వేణు, డాక్టర్ సీతయ్య, లకారం ట్యాంక్‌బండ్‌వాకర్స్ ఆసోసియేషన్, అధ్యక్షులు పూర్ణచందర్, సెక్రటరీ జనార్దన్, వెంకన్న, ఖాదర్, జ్యోతి మాధవి, సత్యవతి, కళావతి, సౌజన్య, రజని, సబిత తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా డ్రెయినేజీ- పట్టించుకోని మునిసిపల్ అధికారులు

**మధిరరూరల్, మే 5, ప్రభాతవార్త:**



మధిర మునిసిపాలిటీ పరిధిలోని ఎస్సీకాలనీ 11వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైంది. వార్డులోని పలు డ్రెయినేజీ కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# రాజ్యాంగం ప్రకారమే దళితులు, గిరిజనులకు ఫలాలు

## విలేకరుల సమావేశంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోటమర్తి సుదర్శన్



**ఖమ్మం, మే 5, ప్రభాతవార్త:**
డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే దళితులకు, గిరిజనులకు ఫలాలు పదవులు దక్కుతున్నాయని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోటమర్తి సుదర్శన్ అన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ కేంద్రంలో దళిత, గిరిజనులు 18 మంది మంత్రులుగా ఉన్నారని రాష్ట్రంలో కాంగ్రెస్ దళిత, గిరిజనులకు ఎంతమందికి మంత్రి పదవులు ఇచ్చారని విమర్శించారు. కేంద్రంలో బిజేపి దళిత, గిరిజనులకు రాష్ట్రపతి పదవులు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాదిగలకు మొండి చేయి చూపిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలిపిన బిజేపికి మందకృష్ణ మాదిగ మద్దతు ఇచ్చారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల రీగన్ ప్రతాప్, కొత్తపల్లి పృధ్వి, తగరం శ్రీనివాస్, దాసరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారీ వ్యవస్థను పెంచి పోషిస్తున్న బీజేపి

## నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉషాకిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేడ విజయ్



**ఖమ్మం, మే 5, ప్రభాతవార్త:**
గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం పేదల నుంచి దోసి పెద్దలకు పెట్టడం అలవాటుగా మారి, అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం మరచి పెట్టుబడిదారీ వ్యవస్థను పెంచి పోషిస్తున్న బీజేపికి తగిన బుద్ధి చెప్పాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉషాకిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేడ విజయ్‌లు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో రైతు వ్యతిరేక చట్టాలతో రైతులు, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిందని అన్నారు. ఆదివాసులు, గిరిజనుల బతుకులకు సిద్ధం చేసేందుకు మనువాదాన్ని బీజేపి పెంచి పోషిస్తోందని విమర్శించారు. బీజేపి రాజ్యాంగాన్ని విస్మరించి ప్రజాస్వామ్య విలువలను పతనం చేసేందుకు రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటిస్తున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లం దేవరాయ, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, ఆర్గనైజర్లు, దేవరాయ సురేష్, వలువాయి శ్రీను, రాష్ట్ర బంజారా మహిళా కో-కన్వీనర్ వినోద నాయక్, బల్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు మానవ సంబంధాలను పెంపొందించుకోవాలి

**మధిరరూరల్, మే 5, ప్రభాతవార్త:**
విద్యార్థులు చదువుతోపాటు మానవ సంబంధాలను పెంపొందించుకోవాలని ఎంఈవో వై.ప్రభాకర్ సూచించారు. ఆదివారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని అంబారుపేట పలగాని వెంచర్‌లో పదోతరగతి, ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల్లో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కలయిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోల్డ్‌మెడల్, ప్రతిభా పురస్కార అవార్డులను అందజేశారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మార్కులు, ర్యాంకులు కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు పట్టణాల్లో చదువుకుంటూ విద్యార్థులతో పోటీపడి ర్యాంకులు సాధించటం మధిరకు గర్వకారణమని పేర్కొన్నారు. కలయిక వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వేమూరి సునీల్, శ్రీనివాసరావు, టీవీరెడ్డి, జంగా నర్సింహారెడ్డి, చారుగుండ్ల లక్ష్మీనర్సింహమూర్తి, యార్లగడ్డ నర్సింహారావు, మిరియాల రమణగుప్తా, కోనా ధనికుమార్, రంగా శ్రీనివాసరావు, చెరుకూరి కృష్ణారావు, గడ్డం రమేష్, కోనా జగదీష్, మైలవరపు వీరభద్రం పాల్గొన్నారు.




ఖమ్మం, కార్పొరేషన్, రఘునాథపాలెం, కల్లూరల్, ఖమ్మం రూరల్



# 8న ప్రపంచ తలసేమియా దినోత్సవం

## సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు

**ఖమ్మం, మే 5, ప్రభాతవార్త:**
ప్రపంచ తలసేమియా దినోత్సవం ఈనెల 8న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కోశాధికారి పి.రవిచంద్రలు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని రితన్య ఆసుపత్రిలో తలసేమియా డేకేర్ సెంటర్‌లో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలా ఈ ఏడాది కూడా నెల రోజుల కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. చిన్నారులకు అవసరమైన రక్తం కోసం రక్తదాన శిబిరాలు, వ్యాదిని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు, ఉచిత మందుల పంపిణీ నిర్వహించామన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా ఈ నెల8న బుధవారం జరిగే కార్యక్రమంలో చిన్నారులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 8 మంది చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్స చేయించి విజయం సాధించామని, ఈ ఏడాది ఎక్కువ మంది చిన్నారులకు బోన్ మ్యారో చికిత్స చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం డేకేర్ సెంటర్‌లో చిన్నారులకు మ్యూజికల్ చైర్, లేమన్ స్పూన్, బెలూన్స్ తదితరుల పోటీలు నిర్వహించామని చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, సభ్యులు పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఎన్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర మరువలేనిది

**మధిరరూరల్, మే 5, ప్రభాతవార్త:**



సమాజాభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్, కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం కలయిక వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు, మధిర ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పాగి బాలస్వామిని ఘనంగా సన్మానించారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే పనిలో నిరంతరం బిజీగా ఉంటారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జర్నలిస్టు బాలస్వామి తన పిల్లల చదువుపై నిరంతరం దృష్టిసారించి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించేవిధంగా తీర్చిదిద్దటం ఎంతో గర్వకారణంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు వేమూరి సునీల్, జంగా నర్సింహారెడ్డి, మిర్యాల రమణగుప్తా, కోనా ధనికుమార్, చెరుకూరి కృష్ణారావు, గడ్డం రమేష్, చారుగుండ్ల నర్సింహమూర్తి, యార్లగడ్డ నర్సింహారావు, టీవీ.రెడ్డి, పరాంకుశం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## దివ్యాంగ కుటుంబానికి వితరణ



<u>లక్ష్మీదేవిపల్లి, మే 5 - ప్రభాతవార్త:</u>
ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ భద్రాద్రి జిల్లా ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీనగర్‌కాలనీ పంచాయతీ ఇందిరానగర్‌కాలనీలోని నిరుపేద దివ్యాంగ కుటుంబం కర్నాటి కృష్ణకుమారికి బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఆ ఇంట్లో అందరూ దివ్యాంగులే... ముగ్గురు ఆడపిల్లల తండ్రి ఈ మధ్య చనిపోయాడు. అభాగ్యురాలైన తల్లి, ముగ్గురు ఆడపిల్లలను పోషించలేక నానా పాట్లు పడుతుంది. వారికి అండగా నిలిచే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాసీం, ఉమెన్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరిమెహరున్నీసా, జ్యోతిరాణి, జరీనాబీ, కల్యాణి, అంజలి, విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## వెంకటలక్ష్మికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



<u>చుంచుపల్లి, మే 5 - ప్రభాతవార్త:</u>
మండలంలోని రామాంజనేయకాలనీ వాసి ప్రజానాట్యమండలి , సీపీఐ, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కూచిపూడి వెంకటలక్ష్మికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు. ఇటీవల ఆమె మరణించగా ఆదివారం జరిగిన సంతాప సభలో పాల్గొని ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన వెంట సాబీర్‌పాషా, లక్ష్మీకుమారి, నాయకులు పాల్గొన్నారు.

## నగదు పట్టివేత

### -సీజ్ చేసిన సిఐ రాజేశ్వరరావు ఎస్సై భవాని సేన్

<u>కాళేశ్వరం, మే 5, ప్రభాతవార్త</u>
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కాళేశ్వరం ఆదివారం రోజున ఉదయం మహాదేవపూర్ సిఐ రాజేశ్వరరావు కాళేశ్వరం ఎస్సై భవాని సేన్ ల స్టాటిటిక్ సర్వేలెన్స్ ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్ర బార్డర్ చెక్ పోస్ట్ వద్ద సర్ప్రైజ్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని సిరోంచ నుండి కాళేశ్వరం వైపు వస్తున్న అశోక్ లీలాండ్ గత గూడ్స్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా సుమారు. 2.94300 నగదు అంబట్‌పల్లికి చెందిన అంజి అనే వ్యక్తికి సంబంధించిన నగదుగా గుర్తించి పోలీసులు విచారణ చేయగా వ్యాపార నిమిత్తం తీసుకెళ్తున్నానని పోలీసులకు తెలుపగా సరియైన ఆధారాలు నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశారు. సిఐ రాజేశ్వరరావు ఎస్సై భవాని సేన్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ గడువు దగ్గర పడుతుండడంతో బార్డర్ చెక్ పోస్ట్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని వివాహ కార్యక్రమాలు వ్యాపారాలు చేసుకునే వారు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 50,000 రూపాయలకు మించి తీసుకెళ్లేవారు సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని ఈ విషయాన్ని ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.వారి వెంట సివిల్ సిఆర్పిఎఫ్ పోలీసులు ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి అనుచతి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

### - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



<u>కొత్తగూడెం, మే 5 - ప్రభాతవార్త:</u>
రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సీఎం వ్యాఖ్యలను ఖండించారు. ఆదివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ గురించి ఇంతలా దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అయి ఉండి ఇలా మాట్లాడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి ఉప్పల వెంకటరమణ, మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగల రాజేందర్, మోరె భాస్కర్, కోలేటి భవాని శంకర్, మురళి, సంకుబాపన అనుదీప్, పోతురాజు రవి, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీను, నాయుడు , పాయం పవీణ్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ఆధ్వర్యంలో కార్ల్‌మార్క్స్ జయంతి



<u>కొత్తగూడెం, మే 5 - ప్రభాతవార్త:</u>
సీపీఐ జిల్లా కార్యాలయంలో కార్ల్‌మార్క్స్ 206వ జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వేతన బానిసత్వం గుట్టు విప్పి శ్రమదోపిడి నుంచి విముక్తి మార్గం చూపి కొందరు వ్యక్తుల చేతిలో పెత్తనం కాకూడదని అందరికీ సమాన అవకాశాలు దక్కాలని కులమత విద్వేశాలకు కాలం చెల్లిందని చాటిన మహనీయుడు కార్ల్‌మార్క్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌పాషా, శేషయ్య, వంగా వెంకట్, వీరస్వామి, మల్లికార్జున్,రమణమూర్తి, వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, రత్నకుమారి, గుత్తుల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులపై చిన్నారులకు అవగాహన



<u>లక్ష్మీదేవిపల్లి, మే 5 - ప్రభాతవార్త:</u>
మండలంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఆదివారం నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమీషన్ ఆదేశాల మేరకు వినియోగదారుల హక్కులపై చిన్నారులకు అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే వినియోగదారులహక్కులపై అవగాహన కలిగి ఉండటం చాలా మంచిదని అన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే మేమున్నామని, పూరినతస్థాయి పరిష్కారాన్ని అందిస్తామంటూ అధ్యక్షుడు శ్యాం అవగాహన కల్పించారు.




చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

## పిడుగుపాటు మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం:

### పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్

<u>కొత్తగూడెం కలెక్టరేట్, మే5 - ప్రభాతవార్త:</u>
పిడుగుపాటుతో మృతిచెందిన వ్యక్తి వివరాలను పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలను అడిగి తెలుసుకున్నారు. ములకలపల్లి మండలం ఒడ్డుగూడెంకు చెందిన బోద శివరాం శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుతో మరణించారు. మరోవ్యక్తి గుగులోత్ శ్రీను గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలను తెలుసుకున్న చౌహాన్ విచారాన్ని వ్యక్తం చేశారని, వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలను అందిస్తామని పేర్కొన్నట్లు ప్రకటనలో తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌళికసదుపాయాలు కల్పించాలి

<u>కొత్తగూడెం కలెక్టరేట్, మే5 - ప్రభాతవార్త:</u>
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల మేరకు మౌళిక సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు ఉండేలా తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు రూ.12.38కోట్ల ధరకు 867మంది రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించామని, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటనలో తెలిపారు.

## భానుడి భగభగ...

### - రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

### - ఎండ వేడిమికి అల్లాడుతున్న ప్రజలు



<u>జూలూరుపాడు, మే 5 - ప్రభాతవార్త:</u>
ఈ ఏడాది వేసవికాలం ప్రారంభమైన నాటి నుంచే భానుడు ప్రజలపై తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఏప్రిల్ నెల నుంచి ఎండలు రోజురోజుకు క్రమేపీ పెరుగుతున్నాయి. ఎండ వేడిమితో పాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు బయటికి రావడానికి భయపడుతున్నారు. మే నెల ప్రారంభం నుంచి ఉష్ణోగ్రత 43 నుంచి 45 శాతం వరకు పెరగడంతో ఎండ వేడిమికి తట్టుకోలేక పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లప్పుడు జన సందోహంతో రద్దీగా ఉండే మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఉదయం 11 గంటల నుంచి జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతోంది. అత్యవసరపనులు మినహా బయటికి ఎవరు కావడం లేదు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సైతం మధ్యాహనం పూట జన సంచారం లేక వీధులన్నీ వెలవెలబోతున్నాయి. సాయంత్రం ఐదు గంటల తర్వాత అవసరాల కోసం ప్రజలు తమ తమ ఇళ్ల రనుంచి బయటకు వస్తున్నారు. వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు విరివిగా వాడుతున్నారు. కూల్‌డ్రింగ్ షాపులు, పండ్ల రసాలు, జ్యూస్ షాపుల వద్ద గిరాకీ పెరిగింది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ వైద్యులు సూచిస్తున్నారు.




## ఓబీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**-ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్‌రెడ్డి**

*మణుగూరు, ప్రభాతవార్త, మే 5 :*



సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో ఓబీ కార్మికుల సమస్యలను యాజమాన్యాలు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం ఏరియాలోని దుర్గా, మహాలక్ష్మీ ఓబీ కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మణుగూరు ఏరియాలో ఓబీ కంపెనీలో పని చేసే కార్మికులు మెరుపు సమ్మె చేస్తున్నారని అయినప్పటికీ ఓబీ కంపెనీల యాజమాన్యాలు స్పందించడం లేదన్నారు. సమన్వయంతో వ్యవహరించి సమస్యల పరిష్కరించుకోవాలన్నారు. కొత్తగా చేసిన అగ్రిమెంట్ మెజార్టీ ఓబీ కార్మిక వర్గం వ్యతిరేకిస్తుందని ఆయన తెలిపారు.

## ఓబీ వర్కర్ల వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవాలి

**-స్థానిక ఎమ్మెల్యే, ఏరియా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి**

**-మణుగూరు ఏరియా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు**

*మణుగూరు, ప్రభాతవార్త, మే 5 :*



సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో ఓబీ వర్కర్ల వేతనాల పెంపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చొరవ చూపాలని ఏరియా కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, జీవీలు కోరారు. ఆదివారం ఏరియాలోని పీకే ఓసీ-2, ఓసీ-4, మణుగూరు ఓసీల్లో అఫ్‌లోడింగ్ పనులు నిర్వహిస్తున్న వర్కర్ల సమ్మె శిబిరం సందర్శించి వారికి మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏరియాలో సుమారు 1300 మంది దుర్గా, మహాలక్ష్మీ ఓబీ కంపెనీల్లో పని చేస్తున్నారని వారి వేతనాల పెంపు కోసం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఏరియా అధికారులు కలిసి ఓబీ కంపెనీల యాజమాన్యంతో చర్చించాలన్నారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపి సమ్మెను విరమింపజేయాలన్నారు. జేఏసీ నాయకులు సురేందర్, గద్దల శ్రీనివాసరావు, సమ్మయ్య, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

దుమ్ముగూడెం మండల పరిధిలోని దుమ్ముగూడెం క్రాస్ - బైరాగులపాడు గ్రామాల మధ్యలో భద్రాచలం - చర్ల ప్రధాన రహదారి పక్కనే అక్రమంగా మద్యం అమ్ముతున్న దుకాణంపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఆదివారం దాడులు చేసి దుకాణంలో నిల్వ ఉంచిన మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నారు. సుమారు రూ.40వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విచ్చలవిడి మద్యం అమ్మకాలపై ఈసీ ఉక్కుపాదం మోపింది. ఈ క్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించగా దుమ్ముగూడెం, బైరాగులపాడు గ్రామాల మధ్య ఒక దుకాణంలో మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో ఈ దాడులు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నారు.ఈ దాడుల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మధు, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులను మోసం చేసిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

**-మణుగూరు ఏరియా సీఐటీయూ బ్రాంచి సెక్రటరీ వి.వెంకటరత్నం**

*మణుగూరు, ప్రభాతవార్త, మే 5 :*



సింగరేణి కార్మికుల డ్యూటీ సమయాల మార్పు విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మోసం చేశాయని మణుగూరు ఏరియా సీఐటీయూ బ్రాంచి సెక్రటరీ వి.వెంకటరత్నం అన్నారు. ఆయన ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణి కార్మికులను నష్టపరిచే విధంగా ఎండా కాలం సమయాలను మార్పు చేశారని అన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని కార్మికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయినప్పటికీ పని వేళలు మార్పు సరిగా లేదని అన్నారు. మొదటి షిప్టు ఉదయం 7 గంటల నుండి ఒంటిగంట వరకు, రెండవ షిప్టు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో లక్ష్మణ్‌రావు, రాంమూర్తి, టీవీఎంవీ ప్రసాద్, ఈశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు, విల్సన్, రాజు, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో ధైర్యం నింపేందుకే పోలీసుల ఫ్లాగ్ మార్చ్

*కరకగూడెం,ప్రభాతవార్త:*



ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఏడూళ్ల బయ్యారం సీఐ కర్నాకర్ తెలిపారు.కరకగూడెం మండల కేంద్రంలో ఆదివారం సెంట్రల్ పోలీస్ ఫోర్స్,స్థానిక పోలీస్ సిబ్బంది కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సీఆర్‌పీఎఫ్ డిఎస్‌పి,కరకగూడం ఎస్ఐ ఎ రాజేందర్,ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ వెంకటప్పయ్య,టిఎస్‌పిఎస్ ఎస్ఐ నరేందర్ స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## మతోన్మాద ఫాసిస్టు బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించండి

**-సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్**

*చర్ల, ప్రభాతవార్త :*



మతోన్మాద ఫాసిస్టు బీజేపీని దాని మిత్రపక్షాలను ఓడించాలని చర్ల మండలంలో పలు గ్రామాలలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ పార్టీ చర్ల నాయకత్వం ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ .. తెలంగాణలో బీజేపీ పాగా వేయాలని టక్కు టమారా విద్యలు చేస్తుందని, బీఆర్ఎస్ నిరంకుశ విధానాల ఫలితంగా అది ప్రజల చేత గత అసెంబ్లీ ఎన్నికల్లో తిరస్కరణకు గురైందని అన్నారు. నేడు బీఆర్ఎస్‌ను కాళీ చేసి ఆస్థానం బీజేపీ పొందాలని చూస్తుందని, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ కనిపిస్తుందని అన్నారు. ఈ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని ప్రధాన టార్గెట్‌గా చేసుకుని ప్రజాస్వామిక లౌకిక శక్తులు దానిని ఓడించాలని పిలుపునిచ్చారు. విప్లవశక్తులు స్వతంత్రంగా తమ పిలుపులను అమలు చేస్తూ మతోన్మాద ఫాసిస్టు బీజేపీని తాత్వికంగా రాజకీయంగా నిర్మాణపరంగా పోరాటం ద్వారా ఎదుర్కొని ఓడించాలని ఆయన కోరారు. వందల ఏండ్ల సహజీవన భారతాన్ని ప్రేమిద్దాం, మత విద్వేషాన్ని ఫాసిజాన్ని ఓడిద్దాం అని ఆయన ఓటర్ మహాశయులకు ఆదివారం పిలుపునిచ్చారు. ఆ పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండా కౌశిక్, మండల నాయకులు చెన్నం మోహన్‌లు పాల్గొన్నారు.

## సిపిఐ కార్యకర్తల సామేలు మృతి

*బోనకల్, మే 05 ప్రభాతవార్త*



మండలంలోని కలకోట గ్రామానికి చెందిన సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తండ్రి సిపిఐ సీనియర్ కార్యకర్త యంగల సామేలు అలియాస్ వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, చిన్నకుమారుడు యంగల కనకయ్య కలకోట టిఆర్ఎస్ గ్రామశాఖ బాధ్యులు, కనకయ్య సతీమణి యంగల మారతమ్మ కలకోట ఎంపిటిసిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సామేలు అంత్యక్రియలు సోమవారం ఉదయం జరగనున్నాయి.

**పలువురి నివాళి :** యంగల సామేలు భౌతిక కాయాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఐ జిలాన లకార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిశోర్ కుమార్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్ కుమార్, మాతంగి శ్రీను, ఏలూరి పూర్ణచందర్‌రావు, తోటపల్లి ఆనందరావు, యంగల పెద్దరమేష్, బలుగూరు అచ్చయ్య తదితరులున్నారు.

## పూర్తిగా ఎండిపోయిన మామిళ్ళ చెరువు

*కామేపల్లి, మే 5, ప్రభాతవార్త :*



కామేపల్లి మండలం కెప్టెన్ బంజర సమీపంలో ఉన్న మామిళ్ళ చెరువు ఈ వేసవిలో పూర్తిగా ఎండిపోయింది. ఈ చెరువులో చుక్క నీరు లేకండా ఎండిపోవడం ఇదే మొదటి సారి అని ఈ ప్రాంత రైతులు ఆదివారం పేర్కొన్నారు. ఎప్పుడు చెరువులో నీళ్ళ ఉండటంతో పుష్కలంగా చేపలు లభించేవని, ఈ ప్రాంత పరిసర గ్రామాలకు సంబంధించిన పశువులకు తాగేందుకు పుష్కలంగా నీరు లభించేదని తెలిపారు. ఈ చెరువు ఎండిపోవటంతో పశువులకు నీటి కొరత ఏర్పడిందని తెలిపారు.

## కామేపల్లిలో కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

*కామేపల్లి, మే 5, ప్రభాతవార్త :*

కామేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు శ్రీనివాసరావు, గోపాలరావు, లక్ష్మీనారాయణ, సుధాకర్, శ్రీను, కొండలరావు, సావిత్రి, శైలను ఘనంగా సత్కరించి పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

## కామేపల్లి లో ఈదురు గాలులతో భారీ వర్షం

*కామేపల్లి, మే 5, ప్రభాతవార్త :*

కామేపల్లి మం డలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురి సింది. ఉదయం నుండి దంచి కొట్టిన ఎండలతో అల్లాడిపోయిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి కాస్త ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వడగండ్ల వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

# ప్రశాంతంగా నీట్-2024 ప్రవేశ పరీక్ష







**- రెండు కేంద్రాల్లో 1125 మంది హాజరు... 49 మంది గైర్హాజరు**
**- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మే 5 - ప్రభాతవార్త:

ప్రతీ సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నీట్ 2024 పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా నుంచి 1174 మంది విద్యార్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేసినట్లు సిటీ కో ఆర్డినేటర్, నవభారత్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1174 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1125 మంది హాజరుకాగా 49 మంది గైర్హాజరయ్యారు. పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 696 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 668 మంది పరీక్షకు హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో 478 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 457 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారు.

ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను నిశితంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా పోలీసులు బందోబసునత నిర్వహించారు.

# స్ట్రాంగ్ రూం వద్ద భారీ భద్రత చర్యలు

**-250 పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంల కమీషనింగ్**
**-పినపాక ఏఆర్వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**





మణుగూరు, ప్రభాతవార్త, మే 5 ః

స్ట్రాంగ్ రూం వద్ద భారీ భద్రతా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సీఆర్‌పీఎఫ్, పోలీసుల రక్షణలో 24 గంటలు కాపలా కాయడం జరుగుతుందని, సీసీ కెమెరా నిఘా నీడలో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని -పినపాక ఏఆర్వో, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. ఆయన ఆదివారం కో ఎడ్యూకేషన్ హైస్కూల్‌లో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన పినపాక సెగ్మెంట్‌లను 250 పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంల కమీషనింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ఈవీఎంల కమీషనింగ్ చేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరచడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధులు, భద్రతా సిబ్బంది సమక్షంలో స్ట్రాంగ్ రూం తాళాలు తీసి ఈవీఎం మిషన్ల బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లు అన్ని సక్రమంగా ఉన్నది లేనిది పరిశీలించినట్లు తెలిపారు. 30 సెక్టార్లు ఏర్పాటు చేసి సెక్టార్ అధికారులు, పీవోలు, ఏపీవోలు వారి సిబ్బంది సహకారంతో సెక్టార్, పీఎస్‌ల వారీగా ఈవీఎంలు కమీషనింగ్ చేయడం జరిగిందన్నారు. బీయూలు 624, సీయూలు 312, వీవీ ప్యాట్‌లు 350, రిజర్వ్ మిషన్‌తో కలుపుకుని ఇంజనీర్ల సమక్షంలో జాగ్రత్తగా పరిశీలించి 23 మంది అభ్యర్థులకు ఓట్లు వేసే బ్యాలెట్ పేపర్ అంటించడం జరిగిందన్నారు. అన్ని మిషన్ల సక్రమంగా పని చేస్తున్నది లేనిది పరిశీలించి జాగ్రత్తగా సీల్ వేసి స్ట్రాంగ్ రూంకు చేరవేయడం జరిగిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం సెక్టార్ వారీగా ఈవీఎం కమీషనింగ్ పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎలక్షన్ డిటి నాగరాజు, ఈవీఎం నోడల్ ఆఫీసర్ ముజాహిద్, కృష్ణ, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపులపై ఫ్లయింగ్ స్క్వాడ్ కొరడా ..!



భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :

భద్రాచలం పట్టణంలోని పలు బెల్ట్ షాపులపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఆదివారం మెరుపుదాడులు చేసింది. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ మధు తెలిపిన వివరాల ప్రకారం ... పట్టణం లోని పాతమార్కెట్ ప్రధాన కూడలి వద్ద గల రెడ్‌బకెట్ ఎదురుగా ఓ షాపులో బెల్ట్‌షాపు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు షాపులో తనిఖీలు చేయగా రూ.27వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. పట్టుబడిన మద్యాన్ని, బెల్‌షాపు నిర్వహకుడిని అదుపులోకి తీసుకుని స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విచ్చలవిడి మద్యం అమ్మకాలపై ఈసీ ఉక్కుపాదం మోపింది. ఈ క్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించగా పాత మార్కెట్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ దాడులు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నారు. ఈ దాడుల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మధు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియలో అన్ని జాగ్రత్తలు పాటించాలి

**రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్**

ఖమ్మం ప్రభాతవార్త:



ఇవిఎంల కమీషనింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకర్గ రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. రిటర్నింగ్ అధికారి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్యఇంజనీరింగ్ కళాశాలలో చేపడుతున్న ఖమ్మం, పాలేరు ఆసెంబ్లీ సెగ్మెంట్ల ఈవిఎం, వివి ప్యాట్ల కమీషనింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ల కనెక్షన్లపై కమీషనింగ్ ప్రక్రియలో చేయాల్సిన, చేయకూడని పనుల విషయమై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు.బ్యాలెట్ యూనిట్‌లోని బ్యాలెట్ స్క్రీన్ తెరచి, బ్యాలెట్ పత్రాల కూర్పు సక్రమంగా చేపట్టి, బ్యాలెట్ స్క్రీన్‌ని అడ్రస్ ట్యాగ్‌తో సీల్ చేయాలన్నారు. బ్యాలెట్ యూనిట్‌లో అవసరమగు సంఖ్య వరకు అభ్యర్థుల నోటాతో సహా మాస్క్ చేయాలన్నారు. థంబ్ వీల్‌ను మొదటి బ్యాలెట్ యూనిట్‌కి బియు-1గా, రెండో దానికి బియు-2గా మూడో బ్యాలెట్ యూనిట్‌కి బియు-3గా సెట్ చేయాలన్నారు.బ్యాలెట్ యూనిట్ ఓటర్ కవర్‌ని పింక్ కవన్ సీల్, అడ్రస్ ట్యాగ్‌లతో సీల్ చేయాలన్నారు. వివి ప్యాట్‌లో కొత్త పేపర్ రోల్‌ని పేపర్ రోల్ కంపార్టుమెంట్‌లో కొత్త పవర్ ప్యాక్, పవర్ ప్యాక్ కంపార్టుమెంట్‌లో అమర్చాలన్నారు.రిటర్నింగ్ అధికారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సంతకాల పింక్ పేపర్ సీల్‌లను వాడాలన్నారు. కమీషనింగ్‌కు హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులను కమీషనింగ్ ప్రక్రియను గమనించాలన్నారు. ఇవిఎంస్ట్రాంగ్ రూమ్ నుండి కమీషనింగ్ ఉంచుకోవాలన్నారు. ఖమ్మం ఆసెంబ్లీ సెగ్మెంట్‌లో 36టేబుళ్ల పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 29టేబుళ్ల ఏర్పాటు చేసి కమీషనింగ్ ప్రక్రియ చేపట్టినట్లు సోమవారంలోగా ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఖమ్మం మున్సిపల్ కమీషనర్ ఆదర్శసురభి, పాలేరు ఆసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్టీసి ఎం.రాజేశ్వరి, తహశీలార్లు, అధికారులు తదితరులు ఉన్నారు.

## ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

మధిరరూరల్, మే 5, ప్రభాతవార్త:



మధిర మండల పరిధిలోని ఖాజీపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఈవీఎంలను భద్ర పరిచిన స్ట్రాంగ రూమ్‌ను ఆది వారం సాయంత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి స్థానిక అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో గణేష్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మైటెంక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.

యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవాణి విద్యానికేతన్‌లో 1995-2002 సంవత్సరంలో పదవ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 23 సంవత్సరాల తరువాత ఏకం అయ్యారు. ఈ మేరకు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల గత స్మృతులను నెమరు వేసుకొని, పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి.లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుదల, కృషితో పూర్వ విద్యార్థులు వారి తల్లిదండ్రుల సహకారంతో వివిధ రంగాలలో ఉన్నత స్థానాలను పొంది, ఇంజనీర్లుగా, లాయర్లుగా, డాక్టర్లుగా, ఉన్నత పదవులలో స్థిరపడి సమాజంలో గుర్తింపు పొందినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, వారిని అభినందించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేణుక, ఎం.తిరుపతి, శ్రీనివాస్, మల్లేశం, పూర్వ విద్యార్థులు డి.సౌజన్య, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులున్నారు.

## ఉరివేసుకొని ఆత్మహత్య

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త.



గోదావరిఖని తిలక్ నగర్‌కు చెందిన బొద్దుపల్లి నరేష్ (38) అనే వ్యక్తి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సింగరేణి ఆర్జీ 1 ఏరియా పరిధిలోని వాటర్ లైన్‌లో ఫిట్టర్‌గా బొద్దుపల్లి నరేష్ విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలం నుంచి మానసిక స్థితి సరిగా లేక ప్రవర్తిస్తున్నాడు. గత నాలుగు నెలల నుంచి డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. గతంలో ఒకసారి ఆత్మహత్యకు యత్నించారు. ఈ నెల 4న రాత్రి 8గంటల ప్రాంతంలో నరేష్ తన ఇంట్లో గల వస్తువులు అన్నింటిని పగలగొట్టి తన తల్లిని విపరీతంగా కొట్టి రోడ్డు మీదకు నెట్టేసి ఇంట్లోకి వెళ్లి డోర్లు వేసుకొని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుని తల్లి బొద్దుపల్లి గోవిందమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు.

## సహకార సంఘాల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కేసెట్టి విక్రమ్



ఎలిగేడు,ప్రభాతవార్త:

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో కేశెట్టి విక్రమ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఆదివారం సమావేశమైన సభ్యులు యూనియన్ ప్రధాన కార్యదర్శిగా దాసరి ప్రసాద్,గౌరవ అధ్యక్షుడిగా హోలీ అంజిరెడ్డి ఉపాధ్యక్షుడిగా గీస సురేష్,కోశాధికారిగా కోలేటి శ్రీనివాస్,ముఖ్య సలహాదారుడుగా మదన్మోహన్,ప్రత్యేక ఆహ్వానితులుగా రమేష్,ప్రచార కార్యదర్శిగా నర్రా ప్రభంజన్ రెడ్డి,డైరెక్టర్లుగా రాజు,కందుల శంకర్,కల్వల కిరణ్,రమణ,భోగి అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సహకార సంఘాల అధ్యక్షుడు బొంగోని శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ మాట్లాడుతూ సహకార సంఘాల సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్న జిల్లా సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బలరాం నాయక్ ను పరామర్శించిన గోపాల్ రెడ్డి



కామేపల్లి, మే 5, ప్రభాతవార్త :

మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ మాతృమూర్తి లచ్చి బాయి మృతి చెందటంతో హన్మకొండ లో వారి స్వగృహంలో పార్థివదేహాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి రామి రెడ్డి గోపాల్ రెడ్డి ఆదివారం సందర్శించి పూల మాలవేసి నివాళులు అర్పించి వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపి వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, ఎస్.కె. పత్తే మహమ్మద్, పిఎసిఎస్ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు రామ్ రెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు మాలోతు భావు సింగ్, దొడ్డ వేణు, లావుడియా వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బలరాం నాయక్ ను పరామర్శించిన మల్లిబాబు

కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ తల్లి లక్ష్మీబాయి మరణ వార్తను తెలుసుకొని బలరాం నాయక్ ను మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆదివారం పరామర్శించారు. లక్ష్మీబాయి మృతి పట్ల తీవ్ర సంతాపమును వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు భూక్యా నాగేంద్రబాబు నాయక్, గుగులోతు రవి నాయక్, మేకల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొత్త లింగాలలో కాంగ్రెస్ మహాసభ

కామేపల్లి, మే 5,, ప్రభాతవార్త :

సిపిఐ, సిపిఎం, తెలుగుదేశం పార్టీ లు బలపరిచిన మహబూబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ కామేపల్లి మండలం స్థాయి బహిరంగ సభ కొత్త లింగాల క్రాస్ రోడ్ లో మాజీ మంత్రి రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి విగ్రహం వెనకాల సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి ఆదివారం తెలిపారు. సభలో ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ మంత్రి, మహబూబాబాద్ పార్లమెంటు ఇన్చార్జి తుమ్మల నాగేశ్వరావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, టీపీసిసి జనరల్ సెక్రటరీ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, ఎన్నికల్లో బలపరుస్తున్న సిపిఐ, సిపిఎం, టిడిపి పార్టీల శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వడదెబ్బతో మృతి చెందిన బాధిత కుటుంబానికి పరామర్శ



బీర్‌పూర్,ప్రభాతవార్త :

బీర్‌పూర్ మండలంలోని మంగెల గోండు గూడెంకు చెందిన కొమురం సోము (58) అనే రైతు శనివారం రోజున వడదెబ్బ తగిలి మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ మండల నాయకులు.అతని కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కెడిసిసి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు,ఎక్స్ జడ్పిటిసి కోల్మూల రమణ,మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నల్ల మహిపాల్ రెడ్డి,యూత్ మండల అధ్యక్షులు నల్ల మహిపాల్‌రెడ్డి,యూత్ మండల అధ్యక్షుడు గాజర్ల రాంచందర్‌గౌడ్,మండల ఉపాధ్యక్షుడు జక్కినపల్లి శ్రీనివాస్‌రావు,మాజీ సర్పంచ్ చుంచు నరేందర్,చిత్రం మారుతి,నాయకులు పురుక రాంచందర్,రాస శంకర్,ఆదేవు రవి,చిత్రం భీమ్‌రావు,కార్యకర్తలు పాల్గొన్నారు.




నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం

## ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి



సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోఆర్డినేటర్ రాజేశం అన్నారు. ఓటరుగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రాజమణి, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేసేందుకు కుట్ర...

### - ఎత్తివేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరిక

### - జిల్లా పరిరక్షణ జెఏసి నాయకులు బొల్లి



సిరిసిల్ల బ్యూరో, మే 05, ప్రభాతవార్త :

పోరాటాలు చేసి సాధించుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతుందని జిల్లా పరిరక్షణ జెఏసి నాయకులు బొల్లి రామ్మోహన్ ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాను ఎత్తివేస్తామని పున పరిశీలిస్తామనే మాటను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తి వేస్తామంటే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. జిల్లాను ఎత్తివేసేందుకే ప్రభుత్వం జుడిషియల్ కమిషన్ వేసిందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసే కుట్ర పన్నుతుందని ఆరోపించారు. జిల్లాను తొలగిస్తారనే విషయాన్ని జిల్లా ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. జిల్లా కోసం అనేక ఉద్యమాలు చేసి అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించి సాధించుకున్నామని తెలిపారు. జిల్లాలను తొలగిస్తే జిల్లా ప్రజలు మాత్రం ఊరుకోరని మరో ఉద్యమానికి సిద్ధం అవుతారని రామ్మోహన్ తెలిపారు. జిల్లాలోని ప్రజలు చాలా చైతన్యవంతులని జిల్లాను రద్దు చేస్తే మాత్రం కాంగ్రెస్ నాయకులకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా ఎత్తివేసే అంశాన్ని వెంటనే సిఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని లేని పక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బుస్సా వేణు, ఆవునూరి రమాకాంత్, ఎండి సత్తార్, లింగంపల్లి సత్యనారాయణ, దశరథం, దార్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## 12 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :

జగిత్యాల పావని కంటి ఆసుపత్రి,ఆపి,రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల నియోజకవర్గ,పరిసర ప్రాంతాలకు చెందిన నిరుపేదలు 12 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్.ఈ కార్యక్రమంలో డా.విజయ్,నాయకులు,ఆసుపత్రి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.